


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

మంగళవారం | 30 డిసెంబరు 2025

పేజీలు 8


# మన జిల్లాల పునర్విభజన లేదు




- ప్రజాప్రతినిధుల డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం
- ప్రభుత్వం పై ఒత్తిడి తేలేకపోయిన ఎమ్మెల్యేలు కొనసాగనున్న అశాస్త్రీయ విభజన
- తమను కర్నూలు జిల్లాలో కలపాలన్న డోన్, నందికొట్కూరు వినతులను పట్టించుకోని ప్రభుత్వం
- ఆదోని జిల్లా డిమాండ్‌కూ మొండిచేయే
- సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చారు..ఇక్కడి ఎమ్మెల్యేల హామీలు బుట్టాదాఖలా చేశారు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** పార్లమెంట్ నియోజకవర్గాలను జిల్లాలుగా వైకాపా విభజించిన సమయంలో అది అశాస్త్రీయమన్న అప్పటి ప్రతిపక్ష, ఇప్పటి అధికారపక్ష తెదేపా ఇప్పుడు ఆనాటి విభజననే కొనసాగించాలని నిర్ణయించింది. ఇది కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నిరుత్సాహాన్ని నింపింది. ఏడాది చివరిలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఊసూరు మనిపించింది. 2024లో రాష్ట్రంలో వైకాపా స్థానంలో అధికారంలోకి వచ్చిన తెదేపా జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుడతామని ప్రకటించడంతో కర్నూలు,నంద్యాల జిల్లాల్లోనూ మార్పులుం టాయని ప్రజలు ఆశించారు. ప్రస్తుతం నంద్యాల జిల్లాలో ఉన్న నందికొట్కూరు, డోన్ నియోజకవర్గాల ప్రజలు తమను కర్నూలు జిల్లాలో కలపాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు.వారి డిమాండ్ల కు తగినట్లుగానే 2024లో జరిగిన ఎన్నిక ల్లో తెదేపా అభ్యర్థులు తమను గెలిపిస్తే జిల్లా మార్పు డిమాండ్‌ను సాధించుకు వస్తామని హామీ ఇచ్చారు. వారినైతే ప్రజలు గెలిపిం చారు కానీ ప్రజలు మాత్రం ఓడిపోయారు. ఎన్నికల సమయంలో తిరుపతి, కడప జిల్లాల్లో పునర్విభజన చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలిచ్చిన హామీలను పట్టించుకోలేదు. ఆదోని జిల్లా కావాలన్న డిమాండ్ సుదీర్ఘకాలంగా ప్రజల్లో ఉంది. ఉమ్మడి జిల్లా విభజన జరిగిన సమయంలోనూ అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని తమకు జిల్లా కావాలని డిమాండ్ చేశారు. తెదేపా ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని వారు ఆశించారు. తెదేపా సామాజిక మాధ్యమాల్లోనూ ఆదోని జిల్లా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ఆదోని జిల్లా డిమాండ్ ను తన దృష్టికి తీసుకురాలేదంటూ ఇక్కడి నేతలపై నింద వేసి తప్పుకున్నారు.

డోన్, నందికొట్కూరు నియోజకవర్గాల ప్రజల కర్నూలు చేరుకునేందుకు 30 నిముషాలు ప్రయాణిస్తే చాలు. జిల్లా కేంద్రమైన నంద్యాల జిల్లాకు చేరేందుకు రెండు గంటలకు పైగా సమయం పడుతోంది.

మిగతా 2లో

## ఆదోని జిల్లా చేయకపోతే మిలిటెంట్ ఉద్యోగాలకు సిద్ధం

- ఆదోని జిల్లా సాధనకై స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం

2లో



కలెక్టరేట్‌ను ముట్టడించిన జేఏసీ నాయకులు

## నేడు వైకుంఠ ఏకాదశి

- సిద్ధమైన ఆలయాలు
- ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తుల తహతహ

2లో


పూజలందుకోనున్న శ్రీ మహా విష్ణువు

## దివ్యాంగుడి వద్దకే వెళ్లి అర్జీ స్వీకరించిన కలెక్టర్

2లో


వికలాంగుడి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

## రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 373 దరఖాస్తులు స్వీకరణ

2లో


రెవెన్యూ క్లినిక్స్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం


హెల్మెట్ ధరించి పెట్రోల్ వేయించుకుంటున్న వాహనదారుడు

## పాత నిబంధన..కొత్తగా అమలు..!

- నేటి నుండి హెల్మెట్ పెట్టుకోవాల్సిందేనంటున్న పోలీసులు
- తూతూ మంత్రమేనంటూ జనం పెదవి విరుపు

**సూర్య ప్రతినిధి, కర్నూలు :** కర్నూలు నగరంలో మోటర్ సైకిల్ నడిపే ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాల్సిందేనని జిల్లా పోలీసు యంత్రాంగం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా మంగళవారం నుండి హెల్మెట్ లేనిదే ఏ పెట్రోల్ బంకులోనూ పెట్రోల్ విక్రయించవద్దని యజమానులకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాల్సిందేనని ఉన్నత న్యాయస్థానాలు ఇప్పటికే తీర్పులు చెప్పాయి.అయితే ఆ తీర్పులను అమలు చేయకపోవడంతో తిరిగి న్యాయస్థానాలను కొందరు సామాజిక సేవకులు ఆశ్రయించగా రాష్ట్ర పోలీసులను ఉన్నత న్యాయస్థానాలు తప్పుబడుతూ భవిష్యత్తులో అమలు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించికలు జారీ అయ్యాయి. దీంతో కర్నూలు నగరంలో హెల్మెట్ల వాడకంపై గత కొద్దిరోజులుగా పోలీసులు ద్విచక్ర

మిగతా 2లో

# ఆదోని జిల్లా చేయకపోతే మిలిటెంట్ ఉద్యమాలకు సిద్ధం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ఆదోనిజిల్లా ఏర్పాటుకై ఆదోని జిల్లా సాధన జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఐదు నియోజకవర్గాల విద్యార్థి సంఘాల జేఏసి నాయకులు కర్నూలు కలెక్టరేట్ ముట్టడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల జేఏసి నాయకులు ఉదయ్ తిరుమలేష్, ఖాజా రమేష్, ఉదయ్ కృష్ణ, ఆఫ్రిది, రఘు, దస్తగిరి, అఖండలు మాట్లాడుతూ ఆదోని ప్రాంతాన్ని జిల్లా చేసేంతవరకు ఉద్యమాలు ఆపబోమని, అవసరమైతే సిఎం చంద్రబాబు ఇల్లు ముట్టడి కూడా చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా కర్నూలు పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలలో కరువు, వలసలు ఆగాలన్న, నిరక్షరాస్యత శాతం తగ్గాలన్న ఆదోనిని జిల్లా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రజా ఆకాంక్ష నెరవేరాలంటే పశ్చిమ ప్రాంతమైన ఆదోనిని జిల్లా చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలోకి దూసుకెళ్లడానికి ప్రయత్నించిన విద్యార్థి సంఘాల నాయకులను, పోలీసులు అడ్డుకున్నారు. తోపులాట అనంతరం జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి విద్యార్థి సంఘాల దగ్గరకు రావడంతో వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌విఎస్ జేఏసి నాయకులు సీమ కృష్ణ, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.



గేటును ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

# పాత నిబంధన.. కొత్తగా అమలు..!

(మొదటి పేజీ తరువాయి)



హెల్మెట్ లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనదారులు(ఫైల్)



హెల్మెట్ లేని వారికి సూచనలు చేస్తున్న పెట్రోల్ బంకు సిబ్బంది

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అదేసమయంలో పలువురికి జరిమానాలు కూడా విధించారు. పోలీసుల నిర్ణయం మేరకు మంగళవారం నుంచి హెల్మెట్ నిబంధన తప్పనిసరిగా ధరించాల్సిందేనని పేర్కొంటున్నారు. లేనిపక్షంలో వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించడం, జరిమానా విధించడం వంటి చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

**పోలీసు చర్యలు తూతూ మంత్రమే :** హెల్మెట్ ధారణపై పోలీసుల చర్యలు నాలుగైదు రోజులకే పరిమితమవుతాయని ఆ తర్వాత ఎవరూ పట్టించుకోరని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. గతంలో కూడా అనేక సందర్భాల్లో పోలీసులు హెల్మెట్‌ల విషయంలో నిబంధనలు పాటిస్తున్నామని చెప్పి కొద్దిరోజుల తర్వాత చర్యలు నిలిపివేసేవారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా న్యాయస్థానాలు గట్టిగా మందలించాయి కాబట్టే మరోమారు నిబంధనలు అమలు చేస్తున్నా మంటూ ప్రకటనలు ఇస్తున్నారని అది సాధ్యమయ్యే పని కాదని వెల్లడిస్తున్నారు. పోలీసుల నిర్ణయం..ప్రజల అభిప్రాయం..ఏది కరెక్ట్ అవుతుందో వేచిచూడాలి.

# రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 373 దరఖాస్తులు స్వీకరణ

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యలకు వేగవంత మైన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఏడు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజల నుంచి మొత్తం 373 దరఖాస్తులను స్వీకరించామని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్స్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై తమ రెవెన్యూ సంబంధిత సమస్యలపై అర్జీలు సమర్పించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో రామునాయక్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అన్నీ మండలాల తహశీల్దార్లు,రెవెన్యూ క్లినిక్స్‌లో ఉత్సాహంగా పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును రెవెన్యూ డెస్క్‌లో నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం మరింత పెంచి సంతృప్తి స్థాయిని మెరుగు పరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. 7 రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 373 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో సిటీ బస్టాండు, సంజీవనగర్ గేట్, తదితర చోట్ల రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు మోటర్ వాహనాల చట్టం గురించి వివరించారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు వాహనాలకు సంబంధించిన సరైన ధృవపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని అన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫార్మ్ ధరించాలని మరియు రోడ్డు ప్రమాదాలను నివారించుటకు డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చో పెట్టుకుని ప్రజలను రవాణా చేయరాదని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.





డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# రీ సర్వేతో రైతులకు ఉపయోగం

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంత రైతులకు రీసర్వేతో మంచి ఉపయోగాలు ఉన్నాయని రైతులు బాగోగులు కోసమే ప్రభుత్వం రీసర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డిప్యూటీ రీసర్వే తహశీల్దార్ భీమేష్ పేర్కొన్నారు. సోమవారం ఆస్పరి మండల పరిధిలోని జోహరాపురం గ్రామంలో రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ రైతులు రీసర్వే బృందానికి సహకరించాలని, భూమి చుట్టు కొలతలు భూమి విస్తీర్ణం సక్రమంగా జరుగుతాయన్నారు. రీసర్వేతో ఏ రైతుకు ఎంత భూమి ఉందని, ఎంత విస్తీర్ణం ఉందనేది రికార్డులు తయారు చేస్తామన్నారు. ఈ గ్రామ సభలో ఏపి కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, గ్రామ రెవెన్యూ అధికారి హరికృష్ణ నాయక్, మండల సర్వేయర్ షఫీవుల్లా, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మన జిల్లాల పునర్విభజన లేదు

(మొదటి పేజీ తరువాయి)

దీంతోనే తమను కర్నూలు జిల్లాలో కలపాలని వారు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి తన నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలో విలీనం చేయిస్తామని హామీ ఇచ్చామని, ఆ మేరకు పునర్విభజనలో ఆ పని చేసి పెట్టాలని అధికార పార్టీ పెద్దలకు లేఖలు రాశారు. చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివరించారు. జిల్లాల పునర్విభజన చివరి సమయంలోనైనా మార్పులుంటాయని ఇక్కడి ప్రజలు ఆశించారు. ఆ ఆశలు ఇక ఆగిపోయాయి. 9 జిల్లాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. ఆ జిల్లాలో కర్నూలు జిల్లా ఒకటిగా మిగిలిపోయింది. జిల్లాల పునర్విభజనకు సంబంధించి రేపు గెజిట్ నోటిఫికేషన్ రానుంది. సోమవారం నాటి మంత్రివర్గ సమావేశంలో జిల్లాల పునర్విభజనపై చివరి నిర్ణయం తీసేసుకుంది ప్రభుత్వం. రాష్ట్రంలో మూడు జిల్లాలు కొత్తగా రాబోతున్నాయి. ఆదోని జిల్లా కావాలన్న డిమాండ్ కూడా నెరవేరకుండానే పునర్విభజన పూర్తయింది.

# నేడు వైకుంఠ ఏకాదశి

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ధనుర్మాసం పరమ పవిత్రమైనదిగా హిందువులు భావిస్తారు. ఈ మాసంలో వచ్చే ఏకాదశికి ప్రత్యేక ప్రాశస్త్యం ఇస్తారు. దీన్ని వైకుంఠ ఏకాదశిగా పవిత్రంగా పండుగలా నిర్వహిస్తారు. ఈ రోజున ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే పవిత్రమైనట్లేనన్నది హిందువుల విశ్వాసం. మంగళవారం వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తనున్నాయి. ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. అయితే సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం జరిగే మార్గం మధ్య ఈ ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున మహావిష్ణువు కొలువైన వైకుంఠంలో వాకిళ్లు తెరుచుకుని ఉంటాయని భక్తులు భావిస్తారు. ఇందు కోసం ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు ప్రాధాన్యత ఇస్తారు. కర్నూలు జిల్లాలోని అహోబిలంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఈ నేపథ్యంలో భక్తులతో కిటకిట లాడబోతోంది. దశావతారాల్లో ఒకటైన నరసింహ స్వామి ఇక్కడ ప్రహ్లాదునికి దర్శనమిచ్చినట్లు చరిత్ర చెబుతున్న నేపథ్యంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటే మహావిష్ణువును దర్శించుకున్నట్లేనని భక్తులు విశ్వసిస్తారు. అలాగే బేతంచర్ల సమీపంలో వెలసిన మద్దిలేటి స్వామి ఆలయానికి కూడా భక్తులు పోటెత్తనున్నారు. అలాగే ఆదోనికి సమీపంలోని ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం కూడా భక్తుల కోసం ముస్తాబైంది. ఇక, కర్నూలు నగరంలో వెలసిన గోదాగోకులం, లలితాపీఠం, విజ్ఞాన మందిరం, వెంకటరమణ కాలనీ, కృష్ణానగర్ కాలనీల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు, బాలాజీ నగర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లోనూ వైకుంఠ ఏకాదశి రోజైన మంగళవారం ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు.



గోదాగోకులం గోపుర ముఖద్వారం

# దివ్యాంగుడి వద్దకే వెళ్లి అర్జీ స్వీకరించిన కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఆదోని పట్టణానికి చెందిన మహమ్మద్ అలీ పుట్టుకతో వికలాంగుడినని తనకు పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించుకోవడానికి పిజిఆర్‌ఎస్ కార్యక్రమానికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ కార్యక్రమం నుండి బయటకు వెళ్లి స్వయంగా ఆ వికలాంగుడి అర్జీని తీసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆటోలో ఉన్న మహమ్మద్ అలీ ఆరోగ్య పరిస్థితి, కుటుంబ వివరాలు ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలని, ముఖ్యంగా వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ స్వయంగా వారి వద్దకు వచ్చి సమస్యను వినడంపై బాధితుడు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేడు మండల సర్వసభ్య సమావేశం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండల సర్వసభ్యసమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మణిమంజరి తెలిపారు. ఈ సమావేశం మంగళవారం ఎంపీడీవో సమావేశభవనం నందు ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నసూరుద్దీన్ అధ్యక్షతన కొనసాగుతుందన్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ లతో పాటు పలు శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను సభా ముఖంగా అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేవిధంగా చూడాలని కోరారు. కావున ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

# పదవి విరమణ ప్రతి ఉద్యోగికి సహజమే..

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్:** పదవి విరమణ ప్రతి ఉద్యోగికి సహజమేనని వైఎస్సార్‌సిపి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రాలయం మండల కేంద్రం పరిమళ ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల విద్యాశాఖ అధికారి మొహినుద్దీన్ పదవి విరమణ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంఈఓ చేసిన సేవలు గురించి కొనియాడారు. అనంతరం ఆయనను శాలువ కప్పి పూలమాలలతో సన్మానించారు. కర్నూలు జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, వైసీపీ నాయకులు న్యాయవాది బుదూరు లక్ష్మీ నారాయణరెడ్డి, ఎంఈఓ రాగన్న,ఎంఈఓ రాగన్న, విద్యాసాగర్, హెచ్ఎం లక్ష్మీకాంత్, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

# సుపోషణ, బాల్యవివాహ్ ముక్త్ భారత్‌పై అవగాహన కలిగి ఉండాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ప్రతి ఒక్కరు బాల్యవివాహముక్త్ భారత్, సుపోషణ కార్యక్రమాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలనే ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని సిడిపిఓ కోటేశ్వరమ్మ అన్నారు. సోమవారం అర్బన్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సిడిపిఓ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలను చేయడం వల్ల కలిగి నష్టాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని వివరించడం జరిగిందన్నారు. బాల్యంలోనే వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడి ఆడపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతారని అన్నారు. అలాగే పిల్లల పోషణ, గర్భవతుల, బాలింతల పోషణ గురించి వివరించామన్నారు. సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనత ఏర్పడడం, వ్యాధినిరోధక శక్తి తగ్గడంతో పాటు చిన్నారుల్లో ఎదుగుదల ఉండదన్నారు. అలాగేఅంగన్‌వాడీ కేంద్రాల్లో ముస్తాబు


సుపోషణ, బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ కోటేశ్వరమ్మ

కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి కేంద్రంలోను అద్దం, దువ్వెన, సోప్, టవల్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కోమల, గర్భవతులు, బాలింతలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షల ఫలితాలపై రైతులకు అవగాహన సదస్సు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** భూసార పరీక్షల ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని వెలుగోడు పట్టణంలో రైతు భరోసా కేంద్రం-3లో నంద్యాల డిఆర్‌సి నుంచి ఏడిఏ సరళమ్మ, ఏఓలు వెంకటేశ్వర్ రెడ్డి, హేమసుందర్ రెడ్డిలు సోమవారం నిర్వహించారు. నేల ఆరోగ్య నివేదిక, పొలం పోషక స్థాయి, సూక్ష్మ పోషకాలు, సేంద్రీయ కార్బన్, తదితర వివరాలను తెలిపారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి

నేలలో ఉన్న లోపాలు బట్టి ఏ ఎరువు ఎంత మోతాదులో వాడాలి, ఎప్పుడు వాడాలి అనే అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. అవసరమైన ఎరువులు వాడటం వల్ల కొనుగోలు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. నేల సంరక్షణ, రైతు శిక్షణ సమతుల్య పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి స్వాతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజలందరి బాధ్యత అని ఉయ్యాలవాడ సర్పంచు మేకల ఓబులేసు అన్నారు. సుద్దమల దారిలో ఉన్న డంపింగ్ యార్డును సోమవారం ఆయన జెసిబి యంత్రం సహాయంతో శుభ్రం చేయించారు. దారిలోకి వచ్చిన చెత్తా చెదారాలను, ముళ్లకంపలను డ్రైనేజీలోని పూడికలను తొలగింపజేశారు. గ్రామంలోని ప్రజలు తడి, పొడి చెత్తలను వేరుగా విభజించి ఇంటింటికి వచ్చే హరిత రాయబారులకు ఇవ్వాలని అన్నారు. ఈ విధంగా చేసినప్పుడే గ్రామమంతా పరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు. మురుగు కాలువలలో దోమలు వృద్ధి చెందకుండా వేస్ట్ ఆయిల్ చల్లుతున్నట్లు తెలిపారు.


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచు

# నగర శివారులో దొంగలు హల్‌చల్..!

**:- మూడు ఇళ్లల్లో చోరీ**
**:- 28తులాల వెండి, మూడు తులాల బంగారు అపహరణ**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని తాలుక పోలీస్ స్టేషన్ పరిధిలో నగర శివారున ఉన్న ప్రజానగర్ కాలనీలో దొంగలు రెచ్చిపోయి ఇం.నెం : 105, 275, 947 నెంబరు గల మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు ప్రజానగర్‌లో నివాసముంటున్న గఫూర్, ఫైరోజ్, స్టార్‌వలి ఇళ్లకు తాళం వేసి వివిధ కారణాలతో వేరే ఊళ్లకు వెళ్లారు. దీనిని గమనించిన దొంగలు అర్ధరాత్రి ఇళ్ల తాళాలు పగలగొట్టి మూడు ఇళ్లలోని బీరువాలను పగలగొట్టి అందులో ఉన్న 28తులాల వెండి పట్టీలు, దాదాపు మూడు తులాల బంగారు, రూ.20వేలు నగదు ఎత్తుకెళ్లారు. దొంగతనం జరిగిందన్న సమాచారం తెలుసుకున్న మూడు ఇళ్ల యజమానులు సోమవారం స్థానిక తాలుక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బీరువాలు పగలగొట్టిన దృశ్యం

# బాల్య వివాహ్ ముక్తు భారత్‌ను ఆచరిద్దాం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** బాల్య వివాహ్ ముక్తు భారత్ నినాదాన్ని ఆచరిద్దామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పిడి విజయ అన్నారు. సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద పిడి విజయ ఆధ్వర్యంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ బిసి వెల్ఫేర్ హాస్టల్, బాలికల కొవ్వొత్తుల ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రతి ఆడపిల్ల తల్లిదండ్రులు బాల్య వివాహాలను వ్యతిరేకించాలన్నారు. ఆడపిల్లకు 18సం॥లు నిండేంతవరకు వివాహాలు చేయకుండా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరి, వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది విజయ కుమారి, జ్యోష్ణ, ఎస్‌సి వెల్ఫేర్ సులోచన, బిసి వెల్ఫేర్ హాస్టల్ శైలజ, ఏఎస్ఐ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను పరామర్శించిన

# వైసీపీ నాయకులు

**హొళగుంద,మేజర్‌న్యూస్:** ఆలూరు నియోజికవర్గ శాసనసభ్యులు బుసిన విరుపాక్షి హైదరబాద్‌లో మోకాలు సంబంధించి ఆపరేషన్ చేసుకుని విశ్రాంయి తీసుకుంటుండగా హొళగుంద మండల వైసీపీ నాయకులు కొండా అమరేశ్, మల్లి సోమవారం పరమార్శించారు. త్వరగా కోలుకుని నియోజికవర్గంలో పర్యటించి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని వారు కోరారు.



# గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవం ఏర్పాటు చేయండి

### ఏపి ఎమ్మార్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్‌మాదిగ

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పౌరహక్కుల దినోత్సవం ఏర్పాటు చేయాలని ఏపి ఎమ్మార్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్‌మాదిగ అన్నారు. సోమవారం స్థానిక తహశిల్దార్ కార్యాలయానికి చేరుకొని డిప్యూటి తహశిల్దార్ గురుస్వామిరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపి ఎమ్మార్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్‌మాదిగ మాట్లాడుతూ వెల్దుర్తి మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో దళితులపై వివక్ష, అంటరానితనం నేటికి కొనసాగుతుందని, దళితులను కనీసం గుడిమెట్లు కూడా తాకకూడదని కొన్ని గ్రామాల్లో అగ్రకుల ఆధిపత్య కులాలవారు హుకుం జారీ చేశారని, కొంతమంది రాజకీయ నాయకుల భయంతో దళితులు బయటికి చెప్పలేని దుస్థితిలో ఉన్నారన్నారు. గ్రామాలలో చట్టాలపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని, పౌర హక్కుల దినోత్సవాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎమ్మార్పిఎస్ జిల్లా నాయకులు టైలర్ రాముడు, బాలమద్ది, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌లో నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకోవాలి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** పదో తరగతి, ఇంటర్ , డిగ్రీ మరియు ఇతర విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ, యువతీ, యువకులందరు నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌లో తమ పేర్లను జాబ్ సీకర్‌గా నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి తెలిపారు. నిరుద్యోగులు తమ మొబైల్ నెంబర్, ఆధార్, ఈమెయిల్ వివరాల ద్వారా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పోర్టల్ ద్వారా ప్రైవేటు ఉద్యోగాల వివరాలు మరియు కెరీర్‌కు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించే అన్ని జాబ్ మేళాల సమాచారం కూడా ఈ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉంటుందని విరించారు. ఏవైనా సందేహాలు ఉంటే పనివేళల్లో జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించాలని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## న్యూ ఇయర్ వేడుకల వేళ.. హద్దులు దాటితే కఠిన చర్యలు



**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ :** నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా,సురక్షితంగా జరుపుకునేలా చూడడానికి పోలీసులు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 31వ తేదీ కొత్తసంవత్సరం స్వాగతపు వేడుకల్లో మద్యం సేవించి అత్యుత్సాహంతో ప్రజలు గానీ హద్దులు దాటినా లేక నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సునీల్ కుమార్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కొత్త సంవత్సరం సంతోషం లేకుండా పోతుందని.సౌండ్ సిస్టమ్‌లు, లౌడ్ స్పీకర్లుకు అనుమతి లేదని శబ్ద కాలుష్యంపై ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈనెల31 డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ ఉంటుందని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, సెలబ్రేషన్స్ పేరుతో జాతీయ రహదారిపైకి రాకూడదని సైలెన్సర్లు తీసి ద్విచక్ర వాహనాలు నడపడం ర్యాష్ డ్రైవింగ్ రోడ్లపై వెళ్లే వారిని ఇబ్బందికి గురిచేసిన రూ.పదివేల జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంటుందని మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలు ఆనందంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని, అయితే చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని తెలిపారు.

## సంతోషంగా 2026కు స్వాగతం పలకండి..వెల్దుర్తి ఎస్సై ఎం.నరేష్

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** 2026 నూతన సంవత్సరానికి స్వాగతం పలికే సమయంలో అర్ధరాత్రి ఎవ్వరూ కూడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా సంతోషంగా స్వాగతం పలకడానికి మండల ప్రజలు, యువత ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని వెల్దుర్తి ఎస్సై ఎం.నరేష్ సూచించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ 2026 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదనే ఉద్దేశ్యంతో ఈనెల 31-12-2025వ తేది బుధవారం సాయంత్రం నుండి వెల్దుర్తి పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, ఓపెన్ డ్రింకింగ్ కేసులను నమోదు చేయడం కొరకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలీసులకు సహకరించాలని, మండల ప్రజలను ఎస్సై ఎం.నరేష్ కోరారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలనీ సూచించారు.

## సాయుధ దళాల సంక్షేమనిధికి మెప్మా మహిళా సంఘాల విరాళం

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికులు, మాజీ సైనికుల కుటుంబాలకు ప్రతిఒక్కరు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయనా ఆడిటోరియంలో మెప్మా మహిళా సంఘాల సభ్యులు సేకరించిన రూ. 2లక్షల విరాళం చెక్కును కలెక్టర్‌కు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీలకు చెందిన మహిళా సంఘాలు తమవంతు బాధ్యతగా ఈ ఆర్థిక సహాయాన్ని అందించడం అభినందనీయమని కొనియాడారు. సమాజంలోని ప్రతిఒక్కరు ఫ్లాగ్‌డే నిధికి విరాళాలు అందించి దేశసేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా పిడి శ్రీనివాసులు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి రక్తరూత్, జిల్లా సమైఖ్య అధ్యక్షులు పద్మ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు చెక్కును అందచేస్తున్న మెప్మామహిళలు

సూర్య

మంగళవారం 30 డిసెంబరు 2025

## మహానందీశ్వరుని సన్నిధిలో పిఆర్ సెంట్రల్ జెసి పూజలు



మహానంది క్షేత్రంలో జాయింట్ సెక్రటరీకి జ్ఞాపిక అందజేస్తున్న డిపిఓ

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో సెంట్రల్ పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రాజేష్‌కుమార్ సింగ్ కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. సోమవారం క్షేత్రానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో ఏఈఓ మధు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామి వార్లకు అభిషేకార్చన పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వదించి తీర్ధప్రసాదాలు అందజేయగా అధికారులు శేష వస్త్రం, జ్ఞాపికతో సత్కరించారు. వీరి వెంట జిల్లా పంచాయతీ అధికారి లలితా బాయి, డివిల్‌పిఓ రాంబాబు, ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, వీఏఓ భాస్కర్, తదితరులు ఉన్నారు.

## ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి



వినతులను స్వీకరిస్తున్న కమీషనర్ ఆర్‌జివి కృష్ణ

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక ఇంచార్జ్ కమీషనర్ ఆర్‌జివి కృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వార్డుల నుండి 21అర్జీలను స్వీకరించిన ఇంచార్జ్ కమీషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్న రాముడు, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డా. నాగశివప్రసాద్, డిసిపి వెంకట రమణ, ఎంఈ మనోహర్, ఆర్ఓ జునైద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలి



మంత్రి జనార్ధన్‌రెడ్డిని కలిసిన రెడ్డి సంఘం నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** యోగివేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర రెడ్డి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపి రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిర్రు ప్రతాప్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ యోగి వేమన సామాజిక సంస్కర్తగా, తత్వవేత్తగా, సమాజానికి ఎనలేని సేవలు చేశారని వివరించారు. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఆద్వర్యంలో అధికారికంగా నిర్వహించడంతో పాటు జీఓ విడుదల చేసి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సందర్బంగా తాడేపల్లిలో మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందచేశామని తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ యోగి వేమన గొప్పతనాన్ని గుర్తుచేసుకున్నారన్నారు. ఈ విషయాన్ని తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీఓ విడుదల కావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తూముకుంట ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు పల్లె శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన జిల్లా టిడిపి అధ్యక్షురాలు



సిఎం చంద్రబాబుకు పూలమొక్కను అందచేసిన జిల్లా అధ్యక్షులు కృష్ణమ్మ

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ సోమవారం అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాకు సంబంధించిన పలు రాజకీయ అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. అంతకుముందు ఆమె విజయవాడలో రాష్ట్ర మంత్రులను కూడా కలిశారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి జిల్లాలోని బిసి వర్గాల సమస్యలపై చర్చించారు. అలాగే రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలోని మౌలిక సదుపాయాల అభివృద్ధిపై విన్నవించారు. ఈ పర్యటనలో జిల్లా టిడిపి నాయకులు కృష్ణమ్మ వెంట ఉన్నారు.

## శ్రీ మఠం హుండీ ఆదాయం లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న మఠం అధికారులు

**మంత్రాలయం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీ మఠంకు రూ. 3,73,66,587 కోట్ల నగదు, 87గ్రాముల బంగారం, వెండి 910 గ్రాములు వచ్చినట్లు మేనేజర్ ఎస్.కె. శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో మఠం సిబ్బంది, బాలాజీ సేవ ట్రస్ట్ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉల్లి రైతులకు న్యాయం చేయండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, గంగుల బిజేంద్రా రెడ్డి, తదితరులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో ఉల్లి సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో రైతులు 14 వేల ఎకరాలలో ఉల్లిని సాగు చేశారని అన్నారు. 8 వేల మంది రైతులకు జివో నెంబరు 10,99లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్‌లో ఉల్లి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 20 వేలు వేయడంలో నంద్యాల జిల్లా రైతులను చేర్చకపోవడం బాధాకరమని అన్నారు. జిల్లాలో 14 వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేశారని అధికారులకు ఈ విషయం తెలీదా అని అన్నారు. 14 వేల ఎకరాలకు సుమారు రూ. 28 కోట్లు జిల్లా రైతులకు కావాల్సి ఉండగా అది అందలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు మొండి చేయి చూపడం తగదని అన్నారు. జనవరి 5 లోపు నంద్యాల జిల్లా రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల భరత్‌కుమార్ రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణ దారులు యూరియాను తెలిపే బ్యానర్ ఏర్పాటు చేయాలి




**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు డివిజన్లోని ప్రతి ఎరువుల దుకాణాల ముందు యూరియా లభ్యత గురించి తెలిపే ఫ్లెక్సీని ఆ దుకాణం యజమాని తప్పక ఏర్పాటు చేయాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువులు ఎమ్మిగనూరులో 1856 టన్నులు, గోనెగండ్లలో 411 టన్నులు, నందవరలో 212 టన్నులు, మంత్రాలయంలో 242 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. డివిజన్లోని నాలుగు మండలాల రైతులకు సరపడ యూరియా ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ఉందని సోమ వారం ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు డివిజన్లో 10వేల ఎకరాల పైగానే మొక్కజొన్న పంటను సాగు చేశారని అందుకు సరిపడ యూరియా స్టాక్ ఉందన్నారు. యూరియా కావలసిన రైతులకు రైతు సేవా కేంద్రల దగ్గర నుంచి సహకార సంఘాల ద్వార పొందవచ్చునన్నారు. ఇప్పటి వరకు గోనెగండ్ల మండలంలో 864 టన్నులు, ఎమ్మిగనూరులో 455 టన్నులు, నందవరంలో 178 టన్నులు, మంత్రాలయం మండలంలో 112 టన్నులు రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. రైతులకు కావాల్సిన యూరియా ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాల ద్వార ఇండెంట్ పెట్టి రైతులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో హేమలత పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధం

**– మంత్రి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు**



ఏకాదశి పూజలకు సిద్ధమైన శ్రీ వెంకటేశ్వరస్వామి

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** బనగానపల్లె పట్టణంలోని కొండాపేట శ్రీ కొట్నాల వెంకటేశ్వరస్వామి ఆలయం మంగళవారం జరగనున్న వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ఆయన సతీమణి బి.సి ఇందిరమ్మ పర్యవేక్షణలో ఏర్పాట్లను సిద్ధం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకునేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ మేరకు బనగానపల్లె సి.ఐ ప్రవీన్‌కుమార్ ఆలయాన్ని పరిశీలించారు. నేటి తెల్లవారుజామున 4గంటలకు స్వామి వారికి పూజలు నిర్వహించి 7గంటలకు భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అర్చకులు మల్లికార్జున శాస్త్రీ తెలిపారు. భక్తులకు మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి దంపతుల సొంత ఖర్చులతో ప్రసాదాలను అందివ్వనున్నారు.

## అహెూబిలంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు పూర్తి

**ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు**





**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైనఅహెూబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లు పూర్తయ్యాయని మఠం ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల కోసం ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, మండపాలను నిర్మించి ప్రత్యేక అలంకరణలు చేశారు. వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు మఠం ప్రతినిధులు తెలిపారు. భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ దర్శనం చేసుకోవాలని వారు కోరారు.

## ఉమామహేశ్వరులను దర్శించుకున్న పంచాయితీరాజ్ జాయింట్ సెక్రెటరీ




**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్‌:**

సోమవారంనాడు యాగంటి శ్రీ ఉమామహేశ్వరులను రాజేష్ కుమార్ సింగ్ (జాయింట్ సెక్రెటరీ పంచాయితీరాజ్ మంత్రిత్వశాఖ) దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. వారు ఆలయానికి చేరుకోగానే ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలను నిర్వహించడం అనంతరం వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి, యాగంటిపల్లె ఉప సర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి, బనగానపల్లె గ్రామ పంచాయితీ ఈ.ఒ బాలాంజనేయులు పాల్గొన్నారు.

# ఘనంగా పక్కీరయ్య స్వామి ఉరుసు



పక్కీరయ్య స్వామి వారి అశ్వమును ఊరేగిస్తున్న భక్తులు

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని నెరుడుప్పల గ్రామంలో వెలసిన పక్కీరయ్యస్వామి ఉరుసు మహోత్సవం సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు, పూజారులుఉరుసు సందర్భంగా స్వామి వారి అశ్వంను వెండి అలంకరణ చేసి ప్రత్యేక పూలతో పూజలు చేసి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్వామి వారి దర్గా దగ్గరకు తీస కువెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉరుసు మహోత్సవం కు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి వారికి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే దర్గాను ప్రత్యేక రంగులతో విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నియోజకవర్గంలోని పలు రాజకీయ పార్టీ ల నాయకులు ఉరుసుకు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంగళవారం జియారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పూజారులు పక్కీరన్న, భీమన్న, మీరాసాహెబ్ తెలిపారు.

## ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌లను అభినందించిన మంత్రి బి.సి

బనగానపల్లెమేజర్,న్యూస్:



మంత్రి బి.సి (ఫైల్ ఫోటో)

ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించిన కోనేరు హంపి, అర్జున్ ఇరవేసిలను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ర్యాపిడ్ చెస్‌లో 5 పతకాలను గెలిచిన తొలి క్రీడాకారిణిగా కోనేరు హంపి సృష్టించిన రికార్డు యువతకు స్ఫూర్తిదాయకమని మహిళా లోకానికి ఆదర్శప్రాయమని తెలిపారు. ఖతర్‌లో జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు తేజాలు సాధించిన ఈ విజయం దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు.

# రూ.33 లక్షలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఫిరోజ్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** పేద ప్రజల ఆపదలో ఉంటే నేనున్నాను అని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి మనస్సుకు నిదర్శనమని నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. సోమవారం మంత్రి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో రూ.33,51,863లు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఫిఒజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 43 మంది బాధితులకు ఈ నగదును అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అతి కొద్ది కాలంలోనే దాదాపు రూ.3 కోట్ల సహాయ నిధి చెక్కులను 426 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, నంద్యాల మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా, కామిని మల్లికార్జున, వార్డు ఇన్‌చార్జ్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహ విద్యార్థులకు ముస్తాబు కిట్లు



జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 155 వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ముస్తాబు కిట్లు అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ భవనంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపేందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను కలిసేందుకు వచ్చే జిల్లా అధికారులు ఎవరు శాలువలు, కేకులు తీసుకుని రావద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో ముస్తాబు కార్నర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు సందర్భంగా జిల్లా సర్వోన్నత అధికారికి అందించే కానుకల స్థానంలో ముస్తాబు కిట్లు అందజేసే విధంగా జిల్లా అధికారులు సహకరించాలని కోరారు. ఈ కిట్లలో అద్దం, దువ్వెన, నెయిల్ కట్టర్, హ్యాండ్‌వాష్, శానిటైజర్ వంటి అవసరమైన వస్తువులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 20మందికి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కర్మాగారాలు, పాఠశాలలు, ఆసుపత్రులు తదితర సంస్థలు తప్పనిసరిగా ఈపీఎఫ్ఓలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉద్యోగులు ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కింద నమోదు చేసుకోవడం ద్వారా ఉద్యోగ సంస్థలకు, ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి ఇన్సెంటివ్ రూపంలో ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి :** జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జలజీవన్ మిషన్, ప్రధానమంత్రి వికసిత్ భారత్ యోజన, కృషి వికాస్ యోజన, పోషణ్ అభియాన్, పీఎం గ్రామీణ సడక్ యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలపై నివేదిక సమర్పించాలన్నారు.

# మహిళలకు ఉచితబస్సు నష్టాలను ప్రభుత్వం అందిస్తుంది

- ★నెలకు 160 కోట్ల రూపాయల భారాన్ని ఆర్టీసీ ఖాతాలో జమ
- ★కొత్తగా 1050 లక్షల ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయి
- ★ఆర్టీసిలో ప్రయాణికులు శాతం పెరిగింది
- ★బస్సు డిపోలకు మహర్దశ తీసుకొస్తాం
- ★నూతన బస్సుడిపోలను నిర్మిస్తాం
- ★ఆర్టీసి ఎండి ద్వారకా తిరుమలరావు ఐపిఎస్



ఆర్టీసి బస్టాండులో ఎండి ద్వారకా తిరుమలరావు

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** శ్రీశక్తి పథకం ద్వారా రాష్ట్రంలో మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు సౌకర్యంలో నష్టాలను చవిచూస్తున్న ఆర్టీసికి నెల నెల ప్రభుత్వం 160 కోట్ల రూపాయల భారాన్ని మోస్తూ రీసి నష్టాలను పూడుస్తూ వస్తుందని ఆర్టీసి ఎండి ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మిగనూరు ఆర్టీసి బస్టాండు, డిపోను ఆయన పరిశీలించారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగష్టు నెల 15 వతేది నుండి మహిళలకు ఐదు రకాల సర్వీసు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాలు రాష్ట్ర వ్యాప్తంగా కల్పించిన ప్రభుత్వం నెల నెల నష్టాలను 160 కోట్ల మేర అందిస్తుందన్నారు. మొదటి విడతగా 400 కోట్లు నిధులు అందించిన ప్రభుత్వం తదుపరి4 160 కోట్ల రూపాయలను అందించి ఆర్టీసి నష్టాలను పూడ్చిందన్నారు. పాతబడిన బస్సులను పునరుద్ధరించి ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ప్రయాణాలు కొనసాగేలా చేస్తున్నాం అన్నారు. పక్క రాష్ట్రాల మాదిరిగా కాకుండా ఎలాంటి అవాంతరాలు రాకుండా ఉచిత సౌకర్యాన్ని రాష్ట్రంలోని ప్రతి మహిళ కూడా బాధ్యతాయుతంగా వాడుకుంటున్నారన్నారు. దీనివల్లనే ఎక్కడా ఎలాంటి అవాంతరాలు రాలేదన్నారు. రాష్ట్రంలో ప్రతి ఆర్టీసి డిపోకు ఎలక్ట్రికల్ బస్సులను అందించే ప్రక్రియల్లో భాగంగా 1050 లక్షల బస్సులను కొనుగోలు చేపడుతున్నాం అన్నారు అవి త్వరలో రోడ్లపైకి వచ్చి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం వచ్చాక 68 శాతం నుండి 86 శాతానికి ప్రయాణికులు పెరిగారన్నారు. కొన్నిట్లో 100 శాతం దాటిందంటూనే రావులపాలెంలో 136 శాతానికి ప్రయాణికులు ఆర్టీసిలోనే ప్రయాణిస్తున్నారన్నారు. ఉద్యోగాలపై విలేఖర్ల అడిగిన ప్రశ్నకు బదులిస్తూ రెగ్యులర్ రిక్రూట్ మెంట్ జరుగుతూ ఉంటుంది 1050 మంది డ్రైవర్లు , కండక్టర్లు తక్కువ బద్దారు. ఆర్టీసి ఉద్యోగులకు ఆరోగ్య పరంగా సమస్యలు ఉంటే ప్రత్యామ్నాయంగా మరోఉద్యోగం అందించే అవకాశాలు ఉంటాయి. ఉద్యోగం వద్దు అనుకుంటే మానటరింగ్ పద్ధతిలో బెనిఫిట్స్ ఉంటాయన్నారు. కౌతాళం బస్సును సర్వీస్‌ను పెంచుతాం అన్నారు. విజయవాడ బస్సు సర్వీస్‌పునరుద్ధరించాలనికోరారు. కర్నూలు జిల్లాలో డిపోలను పెంచితే ప్రయాణికులు ఇబ్బందులు తీరుతాయన్న విలేఖర్ల ప్రశ్నకు డిపో పెంచుకు ఆలోచిస్తాం అన్నారు. శ్రీ శక్తి వల్ల నష్టాలు ఏవి లేవన్నారు. అనంతరం ఆర్టీసి డిపోలు మొక్కలు నాటారు. కార్మికుల సమస్యలపై సమావేశాన్ని ఏర్పాటు చేసు కున్నారు. ఆర్ఎం శ్రీనివాసులు, డిఎం మద్దిలేటి నాయుడు, డిఎస్పి బార్గవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉద్యోగులకు ప్రశంసలు.. :** ఎమ్మిగనూరు ఆర్టీసి డిపోలోని బస్సులను ఎప్పటికి అప్పుడు మరమ్మత్తులు చేయించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేసిన డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు తో పాటు కెఎంపిఎల్ పెంచిన డ్రైవర్లు ఎస్‌బి నవాజ్, నరసన్న, ఈపికె పెంచిన కండక్టర్లు కెఎం సాహెబ్, షరీఫ్, గ్యారేజ్ మెకానిక్ శ్రీనివాసులు సేవలను ప్రశంసిస్తూ వారికి ప్రశంసా పత్రాలు అందించారు. సిబ్బందికి ఉచిత బస్సుద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఎన్ఎంయు నాయకులు ఇస్మాయిల్, ముస్తాక్‌లు పాల్గొన్నారు.

# కోసిగి వాసులకు అరుదైన గౌరవం

- చార్టెడ్ అకౌంట్‌లో ప్రతిభ
- సి.ఎ. మెంబర్‌షిప్ అందజేత
- హర్షం వ్యక్తంచేసిన గ్రామస్తులు



హైదరాబాద్‌లో సర్టిఫికెట్లు అందుకున్న పశువుల కృష్ణ



బెంగళూరులో సర్టిఫికెట్లు అందుకున్న సింగేరి సందీప్

**కోసిగి మేజర్ న్యూస్:** అక్షరాస్యతలోను, అభివృద్ధిలోను, ఆర్థికంగా పూర్తిగా వెనుకబడినటువంటి కోసిగి మండలం నుండి విద్యలో మేముకూడా తక్కువకాదు, ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాం.. లక్ష్యాలను, కలలను సాధించి యువతకు ఆదర్శంగా నిలుస్తాం..అంటూ నేలకోసిగి గ్రామానికి చెందిన పశువుల కృష్ణ, కోసిగి గ్రామానికి చెందిన సింగేరి సందీప్ నిరూపించడం జరిగింది. ఉన్నతమైన పదవులలో చాలా విలువైన పదవులకు సంబంధించిన చార్టెడ్ అకౌంట్‌లో ప్రతిభ కనబర్చి ఉత్తీర్ణత సాధించి సి.ఎ. మెంబర్‌షిప్ సర్టిఫికెట్లను సోమవారం పొందడం జరిగింది. నేలకోసిగి గ్రామానికి చెందిన పశువుల సూరి, హనుమంతమ్మ అనే దంపతులకు చెందిన పశువుల కృష్ణ కోసిగిలో చదివి సి.ఎ.లో అత్యధిక ప్రతిభ కనబర్చడంతో ఆ యువకుడికి హైదరాబాద్‌లో సెక్రెటరీ పంచాయితీరాజ్ ఐఏయస్ శ్రీవివేక్ భరద్వాజ్, ఐ.సి.ఎ.ఐ ప్రసిడెంట్ చరణ ఆజన్‌సింగ్, ఐ.సి.ఎ.ఐ. వైస్ ప్రసిడెంట్ ప్రసన్నకుమార్ చేతులు మీదుగా సర్టిఫికెట్లను పశువుల కృష్ణ కుటుంబ సమేతమంగా వారి సమక్షంలో అందజేయడం జరిగింది. అలాగే కోసిగి గ్రామానికి చెందిన సింగేరి హరి, ప్రభావతి అనే దంపతులకు చెందిన కుమారుడు సందీప్ కూడా చార్టెడ్ అకౌంట్‌లో ప్రతిభ కనబర్చడంతో ఆ యువకుడికి కూడా సి.ఎ. మెంబర్‌షిప్ సర్టిఫికెట్ అందజేయడం జరిగింది. కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేశారు. ఈ సర్టిఫికెట్లను సింగేరి సందీప్ బెంగళూరులో అందుకున్నారు. మారుమూల గ్రామమైన కోసిగి మండలం నుండి ఇద్దరు యువకులు చార్టెడ్ అకౌంట్‌లో ప్రతిభ కనబర్చి కోసిగికి మంచి పేరు తీసురావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేసి అభినందనలు తెలిపారు.

## శ్రీ ఉమామహేశ్వరుల హుండీ ఆదాయం రూ.29,58,000

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్:** యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారంనాడు హుండీ లెక్కింపును నిర్వహించారు. 80 రోజులకుగాను భక్తులు స్వామి వారికి కానుకల రూపంలో రూ.29,58535లు సమర్పించారు. అలాగే 35 గ్రాముల బంగారం, 160 గ్రాముల వెండి స్వామి వారికి భక్తులు సమర్పించడం జరిగింది. వెలుగోడు సమూహ దేవస్థానాల ఈ.ఒ జనార్ధన్ సమక్షంలో ఈ హుండీ లెక్కింపును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాగంటిపల్లె ఉప సర్పంచ్ బండి మాళీశ్వర రెడ్డి, ఆలయ ఈ.ఒ పాండురంగారెడ్డి, ఎం. భరతుడు, శ్రీరాములు, శేఖర్, ఆలయ అర్చకులు , ఆలయ సిబ్బంది, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం

## క్యాలెండర్ ఆవిష్కరణ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లా మార్కెట్‌కమిటీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ను కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిడిఎం లావణ్య, మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొని అసోసియేషన్ సభ్యులందరికీ ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



APPSC, TGPSC Group-1, 2, DSC Police Exams

# కరెంట్ అఫైర్స్

# ధన్‌ఖడ్ రాజీనామా

**14వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జగదీప్ ధన్‌ఖడ్ అనారోగ్య కారణాలతో తన పదవికి 21-07-2025న రాజీనామా చేశారు. రెండేళ్ల పదవీకాలం ఉన్నా ఆయన పదవి నుంచి వైదొలగటం సంచలనం సృష్టించింది. రాజ్యసభ చైర్మన్ కూడా ఐన ఉపరాష్ట్రపతి తన పదవీ కాలానికి ముందే రాజీనామా చేయటం స్వతంత్ర భారత చరిత్రలో ఇది మూడోసారి. ఈ వివరాలు తెలుసుకుందాం...**

ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ 21-07-2025న రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్ హోదాలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలి రోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన రాత్రికల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాలవల్లే తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్ నడిపించుతున్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు 10 వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు.

**స్వతంత్ర భారత చరిత్రలో మూడో వ్యక్తి..**

స్వతంత్ర భారత చరిత్రలో ఉప రాష్ట్రపతి పదవిలో ఉండి పదవీకాలం ముగియకముందే రాజీనామా చేసిన వారిలో ధన్‌ఖడ్ మూడో వారు. అంతకుముందు ఇద్దరు రాజీనామా చేశారు. వారిలో వి.వి.గిరి రాష్ట్రపతి పదవికి పోటీ చేయడం కోసం రాజీనామా చేశారు. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన భైరాన్‌సింగ్ షెకావత్ తన పదవీ కాలానికి నెల ముందుగా రాజీనామా చేశారు.

- రాజ్యాంగంలోని 67(ఎ) ప్రకారం ఆయన రాజీనామా చేశారు.
- అధ్యక్షులుగా ఎన్నికయ్యాక ఆర్.వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ, కె.ఆర్.నారాయణన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 68ఎ నిబంధన ప్రకారం ఉపరాష్ట్రపతి రాజీనామా చేసినా, మరణించినా, ఇతర కారణాల వలన ఖాళీ అయిన వెంటనే ఎన్నికలు జరగాల్సి ఉంది.
- ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వారు మిగిలిన కాలానికి కాకుండ ఐదేళ్ల వరకు పదవీలో ఉంటారు.
- ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయిన 60 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలి.

**భారత ఉపరాష్ట్రపతి- రాజ్యాంగ నిబంధనలు**

- **ఆర్టికల్ 63** - భారత ఉపరాష్ట్రపతి ఉంటారు
- **ఆర్టికల్ 64** - ఉపరాష్ట్రపతి మరే ఇతర వేతనంతో కూడిన పదవిని నిర్వహించరాదు మరియు కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ యొక్క వాస్తవిక చైర్మన్ గా పనిచేస్తారు.
- **ఆర్టికల్ 65** - కార్యాలయంలో స్వల్ప ఖాళీలు ఉన్నప్పుడు లేదా లేదా రాష్ట్రపతి లేనప్పుడు, ఉపరాష్ట్రపతి తన కోసం భర్తీ చేస్తారు
- **ఆర్టికల్ 66** - పార్లమెంటు ఉభయ సభల ప్రతినిధులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. ఉపరాష్ట్రపతి ప్రతినిధుల సభలో గానీ, ఏ రాష్ట్ర శాసనసభలో గానీ పనిచేయడానికి అనుమతి లేదు.
- **ఆర్టికల్ 67** - నియమితులైన నాటి నుంచి ఉపరాష్ట్రపతి పదవిలో అయిదేళ్ల పాటు ఉండాలి.
- **ఆర్టికల్ 68** - పదవీకాలం ముగియకముందే ఉపరాష్ట్రపతి పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు ఓటింగ్ నిర్వహించాలి.
- ఉప రాష్ట్రపతి మరణం, రాజీనామా లేదా తొలగింపుతో మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేయడానికి వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలి.
- **ఆర్టికల్ 69-** ఉపరాష్ట్రపతి రాష్ట్రపతి ముందు లేదా ఆ హోదాలో తాను నామినేట్ చేసిన వ్యక్తి ముందు ప్రమాణం చేయాలి.
- **ఆర్టికల్ 70-** ఇతర అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్రపతి విధులు నిర్వర్తిస్తారు.

**ఉపాధ్యక్షుడి గురించి వివరాలు**

- దేశంలో ఇప్పటిదాకా 16 సార్లు ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరగగా నాలుగు సార్లే ఏకగ్రీవమైంది.
- ఏకగ్రీవంగా ఎన్నికైన ఉపరాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, గోపాల్ స్వరూప్ పాథక్, మహ్మద్ హిదాయతుల్లా, శంకర్ దయాళ్ శర్మ,
- అత్యధిక కాలం పనిచేసిన ఉపరాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, మహ్మద్ అన్సారీ – 10 సంవత్సరాలు
- రెండు సార్లు రాష్ట్రపతులుగా పనిచేసినది సర్వేపల్లి రాధాకృష్ణన్, మహ్మద్ అన్సారీ
- అతి తక్కువ కాలం పనిచేసిన రాష్ట్రపతి వివిగిరి 1 సంవత్సరం 355 రోజులు
- తొలి దళిత ఉపరాష్ట్రపతి కెఆర్.నారాయణన్
- ఉపరాష్ట్రపదవి నిర్వహించి రాష్ట్రపతి పదవికి పోటీ చేసి ఓడిపోయిన ఏకైక వ్యక్తి భైరాన్ సింగ్ షెకావత్
- పదవికి తొలి సారిగా రాజీనామా చేసిన ఉపరాష్ట్రపతి – వి.వి.గిరి
- ఉపరాష్ట్రపతి పదవికి పదవీకాలంలో రాజీనామా చేసినది- వి.వి.గిరి, భైరాన్ సింగ్ షెకావత్, జగదీప్ ధన్‌ఖడ్

**ఉపరాష్ట్రపతిగా పనిచేసి రాష్ట్రపతులుగా పనిచేసిన వారు**

సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, వి.వి.గిరి, ఆర్.వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ, కె.ఆర్.నారాయణన్.

- స్వాతంత్ర్యానంతరం జన్మించిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్
- పదవీకాలంలో మరణించిన ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్
- అధ్యక్షులుగా ఎన్నికయ్యాక ఆర్.వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ, కె.ఆర్.నారాయణన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు.
- రాజ్యసభలో నామినేటెడ్ సభ్యులకు ఓటు హక్కు ఉంటుంది.

**ఉపరాష్ట్రపతి ఎన్నిక విధానం**

- పార్లమెంట్ ఉభయసభలో సభ్యులు ఉపరాష్ట్రపతిని ఎన్నుకొంటారు.
- లోక్‌సభలో ప్రస్తుతం 542 మంది సభ్యులున్నారు. పశ్చిమ బెంగాల్ లోని బసీర్ హాట్ సీటు ఖాళీగా ఉన్నది.
- రాజ్యసభలో 240 మంది ఉన్నారు. 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

**పార్లమెంట్ సభ్యుల వివరాలు**

లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్య 543. రాజ్యసభలో గరిష్ఠంగా 250 మంది సభ్యులు ఉంటారు, కానీ ప్రస్తుత సభ్యుల సంఖ్య 245. వీరిలో 233 మంది రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు, మరియు 12 మంది రాష్ట్రపతి నామినేట్ చేయబడతారు.

- లోక్‌సభలో గరిష్ఠ బలం- 550 (రాష్ట్రాల నుండి 530, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 20)
- ఎన్నుకోబడిన సభ్యులు 543

**రాజ్యసభలో ప్రస్తుత బలబలాలు**

- ఎన్డీయే 133, ఇండియా కూటమి 78, ఇతరులు 29, ఖాళీలు 5

**లోక్‌సభలో సభలో ప్రస్తుత బలబలాలు**

- ఎన్డీయే 293, ఇండియా కూటమి 234, ఇతరులు 15, ఖాళీలు 1
- నలుగురు నామినేటెడ్ సభ్యులతో కలిపి ఉభయ సభల మొత్తం సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మొత్తంగా 422 మంది సభ్యులు ఎన్డీయేకు అనుకూలంగా ఉన్నారు. అంటే నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే అభ్యర్థి ఎన్నిక లాంఛనమే.




## ఉపరాష్ట్రపతులుగా పనిచేసిన వ్యక్తుల వివరాలు

| ఉపరాష్ట్రపతి | రాష్ట్రం | పదవీకాలం | పోటీ అభ్యర్థి |
|---|---|---|---|
| 1. సర్వేపల్లి రాధాకృష్ణన్ | తమిళనాడు | 1952-1962 | ఏకగ్రీవం |
| 2. జాకీర్ హుస్సేన్ | ఆంధ్రప్రదేశ్ | 1962-1967 | ఎన్.సి.సమంత్సిన్హార్ |
| 3. వివి.గిరి | ఒడిశా | 1967-1969 | మహ్మమద్ హబీబ్ |
| 4. గోపాల్ స్వరూప్ పాథక్ | ఉత్తర ప్రదేశ్ | 1969-1974 | ఏకగ్రీవం |
| 5. బి.డి.జెట | కర్ణాటక | 1974-1979 | నిరల్ ఎనెమ్ హోరో |
| 6. మహ్మమద్ హిదాయితుల్లా | మధ్యప్రదేశ్ | 1979-1984 | ఏకగ్రీవం |
| 7. రామస్వామి వెంకట్రామన | తమిళనాడు | 1984-1987 | బిసి కాంబ్లే |
| 8. శంకర్ దయాళ్ శర్మ | మధ్యప్రదేశ్ | 1987-1992 | ఏకగ్రీవం |
| 9. కె.ఆర్.నారాయణన్ | కేరళ | 1992-1997 | కాకా జోగీందర్ సింగ్ |
| 10. కృష్ణకాంత్ | పంజాబ్ | 1997-2022 | సుర్జీత్‌సింగ్ బర్నాల్ |
| 11. భైరోన్ సింగ్ షెకావత్ | రాజస్థాన్ | 2002-2007 | సుశీల్ కుమార్ సిండే |
| 12. మహ్మద్ అన్సారీ | పశ్చిమబెంగాల్ | 2007-2012 | నజ్మా హెప్తుల్లా |
| మహ్మద్ అన్సారీ | | 2012-2017 | జశ్వంత్ సింగ్ |
| 13. వెంకయ్య నాయుడు | ఆంధ్రప్రధేశ్ | 2017-2022 | గోపాల కృష్ణ గాంధీ |
| 14. జగదీప్ ధన్‌ఖడ్ | రాజస్థాన్ | 2022-2025 | మార్గరెట్ అల్వా |

**జగదీప్ ధన్‌ఖడ్ రాజకీయ ప్రస్థానం**

- **జననం :** మే18,1951న రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాలోని కితానా గ్రామంలో హిందూ రాజస్థానీ కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గోకల్‌చంద్, కేసరీ దేవి.
- 1979లో రాజస్థాన్‌హైకోర్టులో లాయర్‌గా చేరిక
- 9వ లోక్‌సభ సభ్యుడిగా 1989-91 ఎన్నిక
- 1989లో జనతాదళ్ ఎంపిగా ఎన్నిక
- చంద్రశేఖర్ కేబినెట్‌లో పార్లమెంట్ వ్యవహారాల సహాయమంత్రిగా పని చేశారు.(1990-91)
- రాజస్థాన్ రాష్ట్ర శాసనసభ (1993-98) కు అజ్మీర్ కిషన్‌ఘడ్ నియోజకవర్గం నుండి శాసన సభ్యుడిగా ఎన్నిక.
- 2003లో బిజెపిలో చేరిక
- 2019-22 పశ్చిమ బెంగాల్ గవర్నర్ గా నియామకం.



అనంతారపు కృష్ణయ్య, డైరెక్టర్
శ్రీ సాయి కోచింగ్ సెంటర్, కోదాడ,
సూర్యాపేట (జిల్లా),
99487 50605

**శ్రీదాశరథి కృష్ణమాచార్య అవార్డు**

ప్రతిష్ఠాత్మక శ్రీదాశరథి కృష్ణమాచార్య అవార్డును 2025 సంవత్సరానికి ప్రముఖ కవి, వ్యాసకర్త అన్నవరం దేవేందర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జులై 22న దాశరథి జయంతి సందర్భంగా ప్రభుత్వం ఈ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తోంది. ఈ అవార్డును సాహిత్యరంగంలో విశేష సేవలు అందించిన కవులకు, రచయితలకు ప్రధానం చేస్తారు.

For Daily Current Affairs
శ్రీ సాయి కోచింగ్ సెంటర్,
YOU TUBE CHANNEL

# ఎకానమి

## APPSC, TGPSC గ్రూప్-1, 2 JL, DL

## PREVIOUS QUESTIONS

**1. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (యస్‌డిజిలు) కి సంబంధించి క్రింది ప్రకటనలలో ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. 10వ లక్ష్యాన్ని సాధించడానికి యువకులకు సమాన వేతనం మరియు మంచి పనిని ప్రోత్సహించే ఆర్థిక వ్యవస్థ యొక్క మొత్తం సంస్కరణ అవసరం.

2. భారతదేశంలో యస్‌డిజిల పర్యవేక్షణను సులభతరం చేయడానికి నీతి ఆయోగ్ నేషనల్ ఇండికేటర్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఎఫ్)ను అభివృద్ధి చేసింది.

3. మిషన్ లైఫ్ స్థిరమైన వినియోగం మరియు ఉత్పత్తి రెండింటికి మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వ మరియు పారిశ్రామిక విధానాన్ని ప్రభావితం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.

4. 4వ సుస్థిర అభివృద్ధి లక్ష్యము యస్‌డిజి4)లో పొందుపరచిన గ్లోబల్ సిటిజన్‌షిప్ భావన అనేది మెరుగైన లేబర్ మార్కెట్‌లను సులభతరం చేసే ఉద్దేశ్యంతో దేశాలలో అనువైన పౌరసత్వ హక్కులను సూచించే సూచన పదం.

సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. అన్నీ 2. 1,2 మరియు 4
3. 3 మాత్రమే 4. 2 మరియు 4

**2. మానవ అభివృద్ధికి సంబంధించి క్రింది ప్రకటనలో ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. తలసరి స్థూల జాతీయ ఆదాయం (జిఎన్ఐ) ఒకే స్థాయిలో ఉన్న రెండు దేశాలు కానీ వివిధ మానవ అభివృద్ధి ఫలితాలతో ముగియడం అభివృద్ధి కంటే వృద్ధి యొక్క ప్రాముఖ్యతను సూచిస్తుంది.

2. అసమానతపై దేశం యొక్క స్కోర్ సర్దుబాటు చేయబడిన మానవ అభివృద్ధి సూచిక (ఐహెచ్‌డిఐ) ప్రజలలో అసమానత లేనప్పటికీ దాని మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ) వలె ఉండదు.

3. లింగ అభివృద్ధి సూచిక (జిడిఐ)లో, 1 కంటే తక్కువ విలువలు పురుషుల కంటే మహిళలకు అధిక అభివృద్ధిని సూచిస్తాయి.

4. ప్లానెటరీ ప్రెషర్స్ – అడ్జస్ట్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (పిహెచ్‌డిఐ) తరాల మధ్య అసమానత (ఇంటర్ జెనరేషన్ అసమానత) పై దృష్టి సారిస్తుంది, అదే విధంగా అసమానత – సర్దుబాటు చేసిన మానవ అభివృది సూచిక (ఐహెచ్‌డిఐ) తరంలోని వివిధ సమూహాల మధ్య అసమానత పై దృష్టి పెడుతుంది.

5. మానవ అభివృద్ధి నివేదిక 2021–22 ప్రకారం, ఒక కొత్త అనిశ్చిత సంక్లిష్టత ఏర్పడుతోంది, ఇందులో మూడు కొత్త ఆందోళనలు ఉన్నాయి. (గ్రహాల మార్పులు, విస్తృతమైన సామాజిక పరివర్తనలు మరియు ధ్రువణ సమాజాలు.

సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 4 మరియు 5 2. 1,3 మరియు 5
3. 2 మరియు 3 4. 1,2 మరియు 4

**3. ఆరోగ్య పరిరక్షణ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జోక్యాలకు సంబంధించి క్రింది ప్రకటనలలో ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. డిస్ట్రిక్ట్ హబ్ ద్వారా స్పెషలిస్ట్ సేవలను పొందేదుకు అన్ని ఆయుష్మాన్ భారత్ హెల్త్ , వెల్నెస్ సెంటర్లలో టెలిమెడిసిన్ సౌకర్యం అందుబాటులో ఉంది.

2. కుటుంబ వైద్యుల పథకాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో (పిహెచ్‌సి) అనుసంధానించాల్సిన అవసరం లేకుండా ఒక స్టాండ్ ఎలోన్ ప్రాజెక్టుగా అమలు చేయడానికి ప్రణాళిక చేయబడింది.

3. కుటుంబానికి సంవత్సరానికి ఆదాయ పరిమితిని రూ. 2.5 లక్షల నుండి రూ. 5 లక్షలకు పెంచడం ద్వారా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం పునరుద్దరించబడినది.

4. ఆరోగ్య ఆసరా పథకం కొన్ని అర్హత షరతులతో ఆపరేషన్ అనంతరం జీవనోపాధి భత్యాన్ని అందించడానికి ఉద్దేశించబడినది.

సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 1. మరియు 4 2. 2,3 మరియు 4
3. 3 మరియు 4 4. 1,3 మరియు 4

**4. ఆంధ్రప్రదేశ్‌లో రవాణా మరియు మౌలిక సదుపాయాలకు సంబంధించి క్రింది ప్రకటన / ప్రకటనలలో ఏది/ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. కృష్ణానదిపై ముక్త్యాల మరియు మద్దిపాడు మధ్య ఆంధ్రప్రదేశ్‌లో మొదటి నదీ ప్రవాహ ప్రాజెక్టు ప్రతిపాదించబడినది.

2. నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్) నుండి సేకరించిన కార్పస్ ఫండ్‌తో భోగాపురం ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభించబడినది.

3. ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల పెట్టుబడులు ఓడరేవులు మరియు పారిశ్రామిక కారిడార్ల వంటి వ్యూహాత్మక పెట్టుబడులకు సంబంధించి మాత్రమే అమలు చేయబడతాయి, కానీ సమాజ ఆస్తులకు సంబంధించి కాదు.

4. సేతు బంధన్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో రైల్



ఓవర్ బ్రిడ్జిలు అభివృద్ధి చేయబడు తున్నాయి.

దిగువ ఇవ్వబడిన కోడ్‌లను ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 1,2 మరియు 3 2. 4 మాత్రమే
3. 1 మరియు 4 4. 2 మాత్రమే

**5. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక విధానం 2023–27కి సంబంధించి క్రింది ప్రకటనలలో ఏది/ఏవి తప్పు?**

1. రాష్ట్ర జిడిపిలో పరిశ్రమల ద్వారా కనీస సహకారం 25% సాధించడానికి

2. 2 వారాల్లో ఎండ్–టు–ఎండ్ ఫెసిలిటేషన్ అందించడానికి

3. సాధనకు సంబంధించిన పది ప్రాధాన్యతలను ఊహించడం

4. పెట్టుబడుల కోసం ప్లగ్ & ప్లే స్టేట్‌గా మారడం పై దృష్టి పెట్టడానికి

5. దరఖాస్తు అందిన తర్వాత 2 వారాల వ్యవధిలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ లిమిటెడ్) (ఎపిఐఐసి) ద్వారా భూమి కేటాయింపును నిర్ధారించడం.

దిగువ ఇవ్వబడిన కోడ్‌లను ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 2,3 మరియు 5 2. 1, 2, 3 , 5
3. 5 మాత్రమే 4. 3 మరియు 4

**6. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ మరియు గ్రీన్ అమ్మోనియా పాలసీ 2023 కి సంబంధించి క్రింది ప్రకటనలలో ఏవి చెల్లుబాటు అవుతాయి?**

1. రాబోయే ఐదేళ్లలో 1 ఎమ్‌పిటిఎ (సంవత్సరానికి మిలియన్ టన్నులు) సామర్థ్యం వరకు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లేదా 2.0 ఎమ్‌టిపిఎ సామర్థ్యం వరకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తిని లక్ష్యంగా చేసుకోవడం లక్ష్యం.

2. న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్ఆర్ఇడిసిఎపి) (కొత్త మరియు పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ, ఎ.పి. లిమిటెడ్) ఈ పాలసీ కింద నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.

3. రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో ద్రవ నత్రజని నిల్వ చేయడానికి మౌలిక సదుపాయాలు ఉన్నాయి. వీటిని ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి గ్రీన్ హైడ్రోజన్ నిల్వ చేయడానికి ఉపయోగించవచ్చు.

4. థర్డ్–పార్టీ / పవర్ ఎక్స్ఛేంజ్ నుండి పునరుత్పాదక శక్తి మరియు/ లేదా బయోమాస్‌ని ఉపయోగించడం ద్వారా గ్రీన్ హైడ్రోజన్ / గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తిని పాలసీ నిషేధిస్తుంది.

దిగువ ఇవ్వబడిన కోడ్‌లను ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి :

1. 2 మరియు 3 2. 1 మరియు 4
3. 1,2 మరియు 3 4. 3 మరియు 4

**జవాబులు :**
1)3 2)1 3)4 4)3 5)2 6)1

## APPSC, TSPSC DSC SI of Police

# జనరల్ సైన్స్

**1. ఫ్రిజ్ నుండి తీసిన ఆపిల్ కంటే పుచ్చకాయ ఎక్కువ సేపు చల్లగా ఉండటానికి కారణం?**

1. అది పరిమాణంలో పెద్దగా ఉంటుంది కాబట్టి ఎక్కువ పదార్థం కలిగి ఉంటుంది.
2. అది ఎక్కువ విశిష్ట ఉష్ణం ఎక్కువగా ఉండే నీటిని కలిగి ఉంటుంది.
3. వాతావరణంలో ఉండే వేడిని పరావర్తనం చేసే ఆకుపచ్చ రంగును ఎక్కువగా కలిగి ఉంటుంది.
4. ఉష్ణాన్ని లోపలకు ప్రవేశింపనీయని దళసరి తొక్కను కలిగి ఉంటుంది.

**2. కింది వాటిలో ఏ శబ్ద పౌనఃపున్యము సాధారణ మానవ చెవికి వినిపించదు?**

1. 25 2. 1200
3. 15000 4. 30000

**3. వెన్న తీసిన పాల యొక్క విశిష్ట సాంద్రత ఎంత?**

1. వెన్న తీయని పాలకంటే ఎక్కువ
2. వెన్న తీయని పాలకంటే తక్కువ
3. ఏమీతేడా ఉండదు
4. విశిష్ట సాంద్రత నీటి కంటే తక్కువ

**4. క్రింది వానిలో ఏది సమానమైన బరువును పోల్చినపుడు ఎక్కువ కెఫిన్‌ను కలిగి ఉంటుంది?**

1. కాఫీ బీన్స్ 2. తేయాకు
3. కాఫీ చాక్లెట్ 4. మిల్క్ చాక్లెట్

**5. ఒక శాంకవ కుప్పెలో ఉన్న జింక్‌కు హైడ్రాలిక్ ఆమ్లాన్ని కలిపి మండుతున్న అగ్గిపుల్లను కుప్పె ముఖ ద్వారం వద్ద ఉంచితే ఏం జరుగుతుంది?**

1. కుప్పెలోని వాయువు దహనం కావడం వల్ల




మంట అంటుకుంటుంది.
2. అగ్గిపుల్ల ఆరిపోతుంది.
3. అగ్గిపుల్ల మామూలుగా మండుతుంది
4. అగ్గిపుల్ల బలహీనంగా మండుతుంది.క

**6. అమెరికాలోని లిబర్టీ విగ్రహం ఆకుపచ్చ రంగులో ఉండడానికి కారణం?**

1. రాగి క్షయకరణము
2. రాగి ఆక్సీకరణ చెందడం
3. ఆకుపచ్చ పెయింట్ ఉపయోగించడం
4. ప్రతి 30 ఏళ్ళకు ఒకసారి రంగు పాలిష్ వేస్తారు.

**7. క్రింది వానిలో ఏ మొక్కల్లో పత్రహరితము ఉండదు?**

1. నాగజెముడు పొర (కాక్టస్)
2. ఆర్కిడ్
3. బంగారుతీగ (కస్కూట లేక డాడర్)
4. అత్తిపత్తి

**8. క్రింది వానిలో ఏది పుట్టుకతో వచ్చే వ్యాధి?**

1. సికిల్ సెల్ రక్తహీనత 2. కుష్ఠు
3. పార్కిన్‌సన్ వ్యాధి 4. క్రోన్ వ్యాధి

**9. కండర పుష్టికి అథ్లెటిక్ క్రీడాకారులకు ఇది కావాలి?**

1. అధిక కాలరీలు కలిగిన ఆహారం
2. అధిక విటమిన్‌లు కలిగిన ఆహారం
3. అధిక గ్లూకోజ్ కలిగిన ఆహారం
4. అధిక ప్రోటీన్ కలిగిన ఆహారం

**10. మానవ ఊపిరితిత్తిలోని శ్వాసనాళాలను మొత్తాన్ని విడదీసి పరిస్తే అది ఎంత విస్తీర్ణం అవుతుంది?**

1. పెద్ద స్టేడియం 2. టెన్నిస్ కోర్టు
3. ఫుట్‌బాల్ మైదానం 4. చిన్న గది

**11. ఒక చెక్కముక్క మరియు ఒక ఇనుపముక్కలను కింది వానిలో 15 నిమిషాల పాటు ఉంచి బయటకి తీసి స్పృశిస్తే ఏది చల్లగా ఉంటుంది?**

1. చెక్క 2. ఇనుము
3. రెండూ చల్లదనములో సమానంగా ఉంటాయి
4. వాతావరణంపై ఆధారపడి ఉంటుంది.

**12. సున్నపురాయిని (కాల్షియం కార్బోనేట్) పరీక్ష నాళికలో ఉంచి సారాయి దీపంతో వేడిచేస్తూ, ఒక మండే అగ్గిపుల్లను పరీక్ష నాళిక ముఖం వద్ద ఉంచినపుడు ఏం జరుగుతుంది?**

1. మంట ఆరిపోతుంది
2. అగ్గిపుల్ల మరింత ప్రకాశవంతంగా మండుతుంది
3. అగ్గిపుల్ల అదే ప్రకాశంతో మండుతుంది
4. అగ్గిపుల్ల ఆరిపోతుంది.

**13. ముక్కిపోవటం ఒక**

1. క్షయకరణ చర్య 2. ఆక్సీకరణ చర్య
3. తటస్థీకరణ చర్య
4. ఇచ్చిన సమాధానాలు ఏవీ కావు

**14. వాహనాలకు ఉండే రియర్ వ్యూ మిర్రర్**

1. సమతల అద్దం
2. పుటాకార అద్దం 3. కుంభాకార అద్దం
4. సగం పుటాకార, సగం కుంభాకార అద్దం

**జవాబులు :**

1)2, 2)4, 3)1, 4)2, 5)1, 6)2, 7)3, 8)1, 9)4, 10)2, 11)311)2, 12)1, 13)2, 14)3

# ఖచ్చితమైన పరిష్కార మార్గం చూపాలి


వికలాంగుడి అర్జీని స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి అర్జీకి ఖచ్చితమైన పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రెవెన్యూ అర్జీదారుల మినహా 151మంది దరఖాస్తుదారుల నుంచి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి ఖచ్చితమైన పరిష్కార మార్గాలు చూపాలని అధికారులకు సూచించారు. నాణ్యతతో పాటు వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ఇంకా 151 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

# ప్రజా సమస్యలకు చట్టపరంగా న్యాయం చేస్తాం

**:- ఎస్పీ విక్రాంత్ పాటిల్**


ప్రజా ఫిర్యాదులు తెలుసుకుంటున్న ఎస్పీ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యలను చట్టపరంగా విచారణ చేసి న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం నగరంలోని కొత్తపేటలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అలాగే ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు శివశంకర్, శ్రీనివాస నాయక్, రామయ్య నాయుడులు పాల్గొన్నారు.

# తిమ్మాపురంలో వైభవంగా హిందూ సమ్మేళనం


హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న మెట్ల మహేశ్వర్ రెడ్డి, పాల్గొన్న ప్రజలు

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని తిమ్మాపురం గ్రామంలో వైభవంగా హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అతిధులుగా కాకనూరు శ్రీ శారద పీఠం పీఠాధిపతి శ్రీ శివయోగేంద్ర స్వామీజి, మెట్ల మహేశ్వర్ రెడ్డి, కళ్యాణ్‌కుమార్, ఆర్వి రామశర్మ, హిందూ సమ్మేళనం అధ్యక్షురాలు కవితలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం హిందూ మనోభావాలపై ప్రజలకు వివరించారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తిగా ప్రతి హిందువు దేశానికి ఉపయోగపడాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా చిన్నారులు కూచిపూడి, భరత నాట్యాలతో ప్రజలను అలరించారు. ప్రతి ఒక్కరు హిందుత్వాన్ని గౌరవించాలని సమాజంలో హిందువుగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చిన్నకాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వీర్ బాల్ పురస్కార గ్రహీతని సన్మానించిన జిల్లా కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఇటీవల రాష్ట్రపతి ద్రౌపతి ముర్మూ చేతుల మీదుగా వీర్ బాల్ పురస్కారం అందుకున్న మద్దికెర మండలానికి చెందిన క్రీడాకారిణి శివాణిని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. ఢిల్లీలో నిర్వహించిన వీర్‌బాల్ దివస్2025కార్యక్రమంలో భాగంగా క్రీడావిభాగంలో శివాణి ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారని కలెక్టర్ అభినందించారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో జావెలిన్ త్రోన్, షాట్‌పుట్ పోటీల్లో పతకాలు సాధించిన శివాణి జిల్లాకు గర్వకారణమని, అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకాదని శివాణి నిరూపించారని కొనియాడారు. విద్యార్థులకు, క్రీడాకారులకు శివాణి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఐసిడిఎస్ పిడి విజయ పాల్గొన్నారు.




# ప్రతి అర్జీని నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలి


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ప్రజల నుండి వివిధ శాఖలకు అందుతున్న అర్జీలను నాణ్యతతో నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఒకే అంశంపై మళ్లీ మళ్లీ అర్జీలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అర్జీదారులతో మాట్లాడి సమస్యను గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులు ఆడిట్ ప్రక్రియను పెండింగ్ లేకుండా చూడాలని, రాబోయే రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి శాఖలో ఫైళ్ల నిర్వహణ పూర్తి ఈ ఆఫీస్ ద్వారానే జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ భౌతిక ఫైళ్ల నిర్వహణ జరుగకూడదని స్పష్టం చేశారు. ఈపిఈఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో అవసరమైన డాక్యుమెంట్లను నిర్దేశిత గడువులోగా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని, పురోగతి తక్కువగా ఉన్న శాఖలు వారంలోపు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చధనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలని సూచించారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 22ఎ చుక్కల భూములు, అడంగల్ సవరణలు, ఇనాం భూముల సవరణలు, రీ సర్వే వంటి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ఈ క్లినిక్‌లు దోహదపడతాయని వివరించారు. జెసి నూరుల్ ఖమర్ రెవెన్యూ క్లినిక్ నిర్వహణను పరిశీలించగా, పలువురు అధికారులు రెవెన్యూ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తే పిడి యాక్ట్ నమోదు చేస్తాం

- పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి
- నందికొట్కూరులో 2.10 కిలోల గంజాయి పట్టివేత
- రూ.60 వేలు విలువైన గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం
- గంజాయి కేసులో నలుగురు నిందితులు అరెస్ట్
- పట్టణ పోలీసు సిబ్బందిని అభినందిచిన పట్టణ సిఐ



**నందికొట్కూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పట్టణ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తూ ఎవరైనా పట్టుబడితే పిడి యాక్ట్ నమోదు చేస్తామని నందికొట్కూరు పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. గత కొంత కాలంగా వివిధ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తూ యువత జీవితాలతో చలగాటమాడుతూ వారిని తప్పుదోవ పట్టించడంతో పాటు మత్తు బానిసకు గురిచేసే గంజాయిని ఒరిస్సా నుంచి తీసుకొచ్చి నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో ఆత్మకూరు కెజి రహదారిలోని పొరకలమ్మ, చాటలమ్మ గుడి సమీపంలో ఉన్న రాయల్ గ్రీన్ సిటీ వెంచర్ వద్ద హోల్‌సేల్ విక్రయాలు జరుపుతున్న గంజాయి ముఠాను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ సూచనల మేరకు నందికొట్కూరు పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి



ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి తన సిబ్బందితో దాడి చేసి పట్టుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన కావేటి నాగశేషాద్రితో పాటు వారి మిత్ర బృందం షేక్ మసూద్, కుమ్మరి హరినాథ్, అనంత చిన్మయానంద గౌడు అలియాస్ చిన్న గౌడులను గంజాయి విక్రయిస్తుండగా సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి తన సిబ్బందితో దాడి చేసి 2.1 కిలోల గంజా యి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 4 సెల్‌ఫోన్‌లతో పాటు రూ.3 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐప్రవీణ్‌కుమార్‌రెడ్డిమాట్లాడుతూగంజాయి,డ్రగ్స్‌మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని యువత ప్రవర్తన తీరు పట్ల తల్లి దండ్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గంజాయి క్రయ విక్రయాలు జరుపుతూ రెండు మూడు సార్లు పట్టుబడితే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడంతోపాటు రౌడీషీట్, పిడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 1972కు సమాచారం అందించాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను అరికట్టేందుకు జిల్లాలో ఈగల్ టీం పని చేస్తుందని తెలిపారు. పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న నిందితులను పట్టు కునేందుకు కృషి చేసిన పట్టణ పోలీసు సిబ్బంది ఏఎస్సై రామచంద్ర, హెడ్ కానిస్టేబుల్ సురేంద్ర, పోలీసుసిబ్బంది బాలకృష్ణ, చిన్నమధు, చెన్నారాయుడు, ఓబులయ్య,మనోహర్‌లతోపాటు హోం గార్డులు సతీష్, గోపాల్‌లను పట్టణ సిఐ, ఎస్సైలు అభినందించారు.

# ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన దేవాలయాలు


ప్రత్యేక అలంకరణలో కోనేటిరాయుడు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :**

వైకుంఠ ఏకాదశి పర్వది నాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఇంజేడు కళ్యాణ వెంకటేశ్వర స్వామిఆలయం, ఉయ్యాలవాడ కోదండ రామాలయం, పెద్దెమ్మనూరు లక్ష్మీచెన్నకేశ స్వామి ఆలయాలు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉత్తర ద్వారా దర్శనం కోసం ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**పండుగ విశిష్టత :** పుష్యమాసంలో వచ్చే ఏకాదశిని వైకుంఠ, ముక్కోటి ఏకాదశిగా పిలుస్తారు. ఈ సమయంలో సూర్యుడు దక్షిణాయం నుంచి ఉత్తరాయణానికి ప్రవేశించడానికి ముందు వచ్చే ఏకాదశి. అలాగే దీనిని మోక్షద ఏకాదశి అని అంటారు. ఈరోజున శ్రీ మహావిష్ణువు వైకుంఠం తలుపులు తెరచిఉంచి గరుడ వాహనుడై ముక్కోటి దేవతలకు దర్శనం ఇచ్చే పర్వదినం కాబట్టి ముక్కోటి ఏకాదశిగా ప్రసిద్ధి చెందింది. పూర్వం రాక్షసుల హింసను భరించలేని మునులు, దేవతలు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శనం చేసుకుని తమ బాధను విన్నవించుకున్నారు. ఆ సమయంలో వారి బాధను అర్థం చేసుకున్న మహావిష్ణువు రాక్షసులతో యుద్ధం చేసి వారిని అంతమొందించి లోకానికి శాంతిని కల్గింపజేశారు. ఈరోజున ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకుంటే సకల బాధల నుంచి విముక్తి పొందవచ్చని పురాణాలు చెబుతున్నాయి. అలాగే ఈరోజున దర్శనం అనంతరం ఉపవాసం చేసి విష్ణు సహస్ర పారాయణం చేయడం వల్ల సకల పాపాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం. వీరికి దైవానుగ్రహంతో పాటు మోక్ష మార్గం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం.

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక

# కార్యక్రమానికి 75 ఫిర్యాదులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా బొమ్మలసత్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ సునీల్ షెరాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 75 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగాఎస్పీమాట్లాడి ఫిర్యాదులపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని పోలీసులను ఆదేశించారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ